వేసవి సెలవుల్లో స్నేహితులతో కులాసాగా ఊళ్ళు తిరుగుతూ కాలక్షేపం చేసి, ఇంకో వారం రోజుల్లో కాలేజీ తెరుస్తారనగా స్వగ్రామం చేరుకున్నాడు జగన్నాథరావు. తల్లిదండ్రులకు జగన్నాథరావు ఒక్కడే కొడుకు. తల్లిదండ్రులు, పుట్టి పెరిగిన ఆ ఊరు అతనికి ఎంతో యిష్టం. తిరిగి కాలేజీకి వెళ్ళేముందు ఒక్క వారమైనా సరే అక్కడ హాయిగా గడిపి పోదామని వచ్చాడు.

అయితే అతనికి ఓ ఇబ్బంది వచ్చిపడింది. ఇరవై ఏళ్ళ కోడెవయసుగాళ్ళ బుర్రల్లో సుళ్ళు తిరుగుతూ, లుంగలు చుట్టేసి ఉక్కిరిబిక్కిరి చేసే ఆలోచనలో చిక్కుకుపోయాడు జగన్నాథరావు. ఓపక్కచూస్తే తన స్నేహితుల్లో చాలామందికి అప్పటికే పెళ్లయిపోయి, కొందరికి పిల్లలు కూడా పుట్టారు. వాళ్లందరికీ ఖుషీగా గడపడానికి అత్తవారి ఇళ్ళు ఉన్నాయి. అడుగులకు మడుగులొత్తే అత్తమామలు, సరసాలాడడానికి



బావామరదళ్ళు, రోజురోజూ రకరకాల పిండి వంటలు... ఇవేవీ తనకు లేకుండాపోయాయి.

మరోప్రక్క చూస్తే తన తండ్రి వచ్చిన ప్రతి సంబంధాన్నీ ఏదోవంకబెట్టి చెడగొట్టేస్తున్నాడు. తనకి కాబోయే మామగార్లని ఇలా ఒక్కొక్కళ్ళనే పంపించేస్తుంటే ఉండబట్టలేక, ఓనాడు తండ్రి దగ్గరకు వెళ్ళి యధాలాపంగా అన్నట్టు "నాన్న గారూ! పోనీ ఏదో ఓ సంబంధం ఒప్పేసుకో కూడదా! బాగా డబ్బుగుంజాలని ఇల్లా ప్రతీ సంబంధం దాటేస్తున్నారని ఊళ్ళోవాళ్ళు అను కుంటున్నారు" అన్నాడు. "నువ్వు అంటున్నది చాలావరకూ నిజమేసుమా" అని ఒప్పుకు న్నట్టు ఓ చిరునవ్వు నవ్వి, తలపంకిస్తూ తిరిగి చుట్ట మరోపీల్చుపీల్చి పొగవదిలేస్తూ "అయినా ఇప్పుడే తొందరేమొచ్చిందిరా అబ్బాయ్! నీ చదువు పూర్తి అయాక చూడొచ్చులే! ఏమం టావ్?" అన్నారు వాళ్ళ నాన్న వెంకయ్యగారు.

ఏమంటాడు తను? తన ఆశలన్నీ ఆ చుట్ట పొగలాగే గాలిలో కలిసిపోయాయి. పైకిమా త్రం లోపల తొందర తెలియనీయకుండా "అదే మిటి నాన్నగారూ! మీకంటే నాకెక్కువ తెలు సా?" అని ఊరుకున్నాడు. తన తొందర ఆయ నకేమి తెలుస్తుంది? అని లోపల అనుకుంటూ.

ఆడశాల్తీ స్ఫురణకి వస్తే చాలు... అతనిలో అలజడి ఆరంభమయ్యేది. ఆడవాళ్ళుఎదురైతే మనసు మెలికలు తిరిగిపోయేది. రోజుకి అయి దారుసార్లు ముఖం రుద్దేవాడు సబ్బుతో. జాగ్ర త్తగా స్నో, పౌడర్లు వాడేవాడు. పంచె కట్టడానికి ఓ అరగంట పట్టేది. కుచ్చెళ్ళు తీరుబడిగా సర్ది, గదిలో అటూఇటూ పచార్లు చేసేవాడు ఏరక మైన నడక బాగుంటుందో నిర్ణయించడానికి. చొక్కా కాలర్ పైకి ఎత్తేవాడు కొంత గంభీరత్వం తెచ్చుకోడానికి. పెదిమలు మరీ దగ్గరగా ఉం డాలా, లేక కాస్త దగ్గరగా ఉంటే సరిపోతుం దా? ఇది తేల్చుకోడానికి అద్దంముందు నుం

# సుబ్బి

చుని, కళ్ళూ పెదిమలూ అటూ ఇటూ త్రిప్పు తూ కొంతసేపు ప్రయత్నం చేసేవాడు. ప్రతి అమ్మాయీ తనని ఆపాదమస్తకం పరీక్షగా చూస్తోందనీ, తన పంచె కట్టు మొదలు తన చొక్కారంగు దాకా అన్నీ గమనించేస్తోందనీ అతని నమ్మకం.

మరి - ఇంక సుబ్బి ఉంది. ఎప్పుడూ తనకేసే చూస్తుంటుంది తినేసేటట్టు.

చిన్నప్పటినుంచీ తనకు తెలుసు... వాళ్ళిం ట్లోనే పెరిగింది. దానికి ఎవళ్ళూలేరు. దాని తల్లికూడ వాళ్ళింట్లోనే పనిపాటలు చేస్తుండేది. సుబ్బికి మూడేళ్ళయినా నిండకుండా దానితల్లి చచ్చిపోయింది. ఇప్పుడు సుబ్బి వాళ్ళమ్మలాగే, నమ్మకంగా పనిజేస్తూ ఇంట్లోనే ఉండిపోయిం ది. ఇదివరకెప్పుడూ సుబ్బిని పరకాయించి చూడలేదు జగన్నాధరావు. ఇప్పుడేదో మార్పు వచ్చింది. ఇప్పుడు పెద్దదయింది. పాతచీర చిరుగుల్లోంచి పొంగి తొంగిచూసే యవ్వనం కేసి కన్నార్పకుండా చూస్తున్నాడు జగన్నాధ రావు. సుబ్బి కూడా తనకేసి కళ్ళప్పగించి చూ

పాలగుమ్మి పద్మరాజు

స్తోంది. చదువుకున్న అమ్మాయిలలాగా చిరునవ్వులు విసరడం గాని, చిలిపి చేష్టలు చేయడంగాని, గడుసుగా మాట్లాడడం గానీ దానికి తెలియదు. కానీ తనను చూస్తున్నప్పుడు ఆ కళ్ళు మెరిసిపోయేవి.

ఒక సాయంకాలం తండ్రి పనిమీద పొరుగూరు వెళ్ళాడు. తల్లి వంటింట్లో పనుల్లో మునిగిఉంది. ఇంటి వెనక వరండాలో మూలగా ఒక్కర్తే కూర్చుని కుప్పగా పోసిన బియ్యంలోంచి రాళ్ళు ఏరుతోంది సుబ్బి. ఇంట్లో ఆ పక్కకి సాధారణంగా ఎవ్వరూరారు. జగన్నాథరావు ధైర్యంచేసి ఆమె దగ్గరకు వెళ్ళాడు. ఆమె అతనివేపు తలెత్తి చూసి, భయంభయంగా కళ్ళు వాల్చేసింది. జగన్నాథరావు చొరవచేసి రవిక తొడగని ఆ భుజాన్ని స్పృశించాడు. ఇద్దరి శరీరాల్లోని వేడిరక్తం పరవళ్ళు తొక్కింది. ఇంట్లో ఏదో చప్పుడైనట్టు అనిపించి, తొందరగా బయటకు వచ్చేశాడు. అక్కడ ఎవరూ లేరు. కొండంత ధైర్యంతో తిరిగి లోపలికి వెళ్ళాడు జగన్నాథరావు.

ఇంక సుబ్బికి - ఎవరూ అంత మృదువుగా, అప్యాయంగా తన భుజాన్ని నిమరలేదు. ఎంతో హాయిగా అనిపించింది... జగన్నాథరావు కౌగిలిలో లొంగిపోయింది.

తర్వాత సెలవులు అయిపోయాయి. జగన్నాథరావు కాలేజి చదువుకి వెళ్ళిపోయాడు.

భవిష్యత్‌ని గురించి ఆలోచించేంత తెలివి సుబ్బికిలేదు. దానికి తెలిసిందల్లా రెండు విషయాలు... తాను నెల తప్పాననే రహస్యం వీలైనంతవరకూ దాచి పెట్టడం, ఇంటిపనులు మాత్రం అనుమానం రాకుండా యధావిధిగా చేసుకోడం. కానీ తన పరిస్థితి క్రమేణా జగన్నాథరావు తల్లి రత్తమ్మ గారికి తెలియవచ్చింది.

ఒకరోజు రత్తమ్మగారు సుబ్బిని దగ్గరగా

## పాత బంగారం

తెలుగు కథకుల్లో ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన ఏకైక రచయిత కీ॥శే॥ పాలగుమ్మి పద్మరాజు.

ఆయన కథల్లో మంచి కథకుండాల్సిన లక్షణాలన్నీ కనిపిస్తాయి.

23 సం॥ల వయస్సులో ఆయన రాసిన తొలికథ 'సుబ్బి'. కథ పుట్టగానే పరిమళించింది. తొలికథలు రాసే వాళ్లకిది చక్కని ఉదాహరణ.

మా పాఠకుల కోసం ఈ నెల 'పాత బంగారం' గా ఈ కథని అందిస్తున్నాం. 1937-38 ప్రాంతాల్లో వ్రాయబడి చాలా కాలం అముద్రిత రచనగా ఉండిపోయిన ఈ కథ 1985 జ్యోతి దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురితమైంది.

కూచోబెట్టుకుని బుజ్జగిస్తూ "పిచ్చిపిల్లా! ఆ వెధవ ఎవడో చెప్పవే! చెవులుపట్టుకు లాక్కొచ్చి నీ మెళ్ళో పుస్తె కట్టిస్తాం" అని అడిగిచూసారు.

సమాధానంగా సుబ్బి ఏడుపు మొదలెట్టింది. అప్పటికి సుబ్బికి ఇంకో విషయం అవగాహనలోకి వచ్చింది. ఎవరు ఏమి అడిగినా సమాధానం చెప్పకుండా భోరున ఏడవడం ఒకటే మార్గమని. ఈ వార్త పొగకమ్ము కున్నట్టు బయటికి పొక్కడం మొదలైంది. ఈ సందర్భంగా జగన్నాథరావు పేరు మాత్రం ఎక్కడా వినిపించలేదు. అతను ఉన్నదల్లా వారంరోజులు. అతను సెలవులకి ఇంటికి వచ్చినట్టే గుర్తులేదు చాలామందికి.

సుబ్బి ఏడుపు, దాని పరిస్థితి చూసి రత్తమ్మగారి గుండె కరిగిపోయింది. భయపడవద్దని దాన్ని ఓదారుస్తూ, భర్త దగ్గరకు వెళ్ళి ఈ విష

యం ఆయన చెవిలో వేసింది. వెంకయ్యగారు కంగారు పడిపోయారు.

"వెధవముండని బయటికి పంపించే సెయ్" అని అరిచాడు.

"ఏమండీ! అది అమాయకురాలు. అభం శుభం తెలియని వెర్రిముండ! ఇప్పుడు దాన్ని బయటికి గెంటేస్తే ఏమైపోతుందండీ! ఎవరో దారినపోయే వెధవ దాన్ని మోసం చేస్తే అదో క్కర్తీ ఇదంతా భరించాలి పిచ్చిముండ!" అంది రత్తమ్మగారు భర్తని బ్రతిమాలుతూ. సుబ్బిని చిన్నప్పటినుంచీ పెంచిన మమకారం ఆవిడది.

ఇల్లాంటి విషయాలలో రాజీపడేతత్వం కాదు వెంకయ్యగారిది. ఆయన చిరాగ్గా మంచం మీద కూచున్నవాడల్లా లేచి...

"బయటికి గెంటేయ్! ఇలాంటి వెధవపని చేస్తే ఇంట్లో ఎలా ఉండనిస్తామనుకుంది? బుద్ధి ముందే వుండాలి" అన్నాడు గొంతుకహెచ్చిస్తూ.

తిరిగి తిరిగి అదేమాట ఆయన అనడంతో రత్తమ్మగారికి మగజాతి మీదఉన్న అసహ్యం అంతా బయటికి వచ్చేసింది, ఆమె కళ్ళు ఎర్ర బడ్డాయి. కంఠం ఖంగ్‌మంది.

"మొగాళ్లకేమి తెలుస్తాయండీ ఆడదాని కష్టాలు? దీన్ని చెడిపిన వెధవ మాత్రం తలెత్తు కుని నలుగురిలో రాజాలా తిరగొచ్చు! ఇది మాత్రం దిక్కూ మొక్కూ లేకుండా రోడ్డుమీద పడి ముష్టెత్తుకోవాలి! అదేగదా మీ మగధర్మం. ఇదిగో చూడండి! నేను చెపుతున్నాను. - నేను మాత్రం నా నోటితో దాన్ని బయటికి పొమ్మ నను. కావాలనుకుంటే మీ చేతులతో మీరే బయటికి గెంటేయండి" అంది ఖచ్చితంగా. ఆమె ధోరణిచూసి వెంకయ్యగారు కాస్త తగ్గేరు.

"అయితే ఇప్పుడేమి చెయ్యగలం? తనంత తానే కొని తెచ్చుకుంది ఇదంతా" అన్నారు కొంత సామరస్య ధోరణిలో. రత్తమ్మగారు అందుకున్నారు "అవును పొరపాటే జరిగింది. ఇప్పుడు మనింట్లో ఉండనిస్తే ఏం కొంప మునుగుతుంది? అది మన బంధువుకాదు. అందుచేత ఇరుగూ పొరుగూ మనల్ని తప్పు బట్టుకోరు. పైగా మన ఔదార్యానికి మెచ్చుకో వచ్చు కూడా. అది పుట్టినప్పటి నుంచీ ఈ యింట్లోనే పెరిగింది. ఇకముందుకూడా ఇక్కడే వుంటుంది." అని ఢంకా బజాయించి చెప్పే శారు రత్తమ్మగారు.

వెంకయ్యగారు సమాధానం చెప్పలేదు. మాట్లాడకుండా బయటికి వెళ్ళిపోయారు. ఇలా తయారైన పరిస్థితికి లోపల చిరాకు పడుతూ. ఆయన మౌనాన్ని అంగీకారంగానే స్థిరపర చేశారు రత్తమ్మగారు.

సుబ్బి అక్కడే ఉండిపోయింది. ఒక పక్క రత్తమ్మగారి ఆపేక్ష ఆమెపట్ల ఎక్కువైంది. మరో ప్రక్క వెంకయ్యగారికి చిరాకుఎక్కువైంది. చిన్న చిన్న విషయాలకీ... చీటికీమాటికీ ఆయనకు కోపం వచ్చేస్తోంది. ఇది చూసి రత్తమ్మగారి పట్టుదల మరీ ఎక్కువై, సుబ్బిమీద ఈగైనా వాలకుండా చూస్తోంది. ఇంచుమించు పుట్టిం టికి పురిటికి వచ్చిన కూతురులా చూడడం మొదలెట్టింది సుబ్బిని.

సుమారు ఇరవై యేళ్ళక్రితం మొదటిసారి జగన్నాధరావుని కడుపుతో వున్నప్పటి రోజులు జ్ఞాపకం వచ్చాయి ఆవిడకి. ప్రతి స్త్రీకీ అది ఒక అపూర్వమైన అనుభవం. ఏవేవో అవీఇవీ తినాలని ఒకటే కోరిక - తీరానోట్లో పెట్టుకునే సరికి ఒకటీ రుచించక పోవడం. ఒక్కోసారి ఏదో చెప్పలేని భయం, నిరాశా. మరొకసారి మనసులో దేహంలో చెప్పలేని ప్రశాంతత. ఎంతటి కజ్జాకోరు, గయ్యాళి స్త్రీ అయినాసరే గర్భిణిగా ఉన్నప్పుడు మాత్రం తృప్తి నిట్టూర్పు

లతో అపురూపంగా కనిపిస్తుంది. అప్పుడు వాళ్ళను చూసే మగవాళ్ళ చూపుల్లో కూడా ఏదో మార్దవం వ్యక్తమౌతుంది. గర్భిణీ స్త్రీ తనకు తెలియకుండానే ఇంట్లో అందరి కంటే తానేదో ప్రత్యేకత కలిగిన వ్యక్తిలా సంచరిస్తుంది.

సుబ్బి ఏమీ అడగకపోయినా, దానికి ఇష్టమున్నా లేకపోయినాసరే... రకరకాల పిండివంటలు చేసిపెట్టేవారు రత్తమ్మగారు. సుబ్బికి అన్నివిధాలా అండగా ఉండి, తృప్తి పొందేవారు.

నెలలు నిండగానే పండులాంటి కొడుకును కంది సుబ్బి. ఆనందంతో రత్తమ్మగారి మనసు నిండిపోయింది. ఇరవై ఏళ్ళ తర్వాత ఆ ఇంట్లో చంటి బిడ్డ కంఠం విప్పింది ఈ ప్రపంచంలోనికి తన రాకను తెలియచేస్తూ. ఆ బిడ్డను చేతుల్లోకి తీసుకుని ముద్దులాడాలని మనసు ఉవ్విళ్ళూరేది కానీ ఆ పని చేయలేక పోయేది.

ఈ పనసపండులాంటి కొడుక్కి తండ్రి ఎవడో ఇప్పుడైనా చెప్పమని ఎన్నోసార్లు రత్తమ్మగారు అడిగారు. కానీ వెనకటి సూత్రమే పఠించి అడిగినప్పుడల్లా ఏడుపు మొదలెట్టేది సుబ్బి.

ఒకరోజు వెంకయ్యగారు భార్యని పక్కకి పిలిచి, "అయిందేదో అయిపోయింది. ఇప్పుడింకదాన్ని బయటికి పంపించేస్తే మంచిదేమో" అన్నాడు.

"అయిందేదో అయిపోయింది కాబట్టే దాన్ని ఇప్పుడు ఎక్కడకూ పంపనక్కరలేదు. మన ఇంట్లో బిడ్డని ఎల్లాగాకన్నది. ఇప్పుడు పంపడం దేనికి? ఇక్కడ ఉంటే ఇల్లాంటి పొరబాటు తిరిగి చెయ్యదు" అని తీర్పు చెప్పేశారు రత్తమ్మగారు.

ఆ ఇంట్లోనే వెనకవరండాలో ఓమూలగా, ఓ గుడ్డ ఉయ్యాల్లో పగలంతా కాకుల జోల పాట, రాత్రంతా ఎలకలగస్తీ – వీటి మధ్య పెరుగుతూ వచ్చాడు సుబ్బికొడుకు. పరిసరాలతో తనకేమీ ప్రమేయం లేనట్టు ఏడిచేవాడే కాదు ఆకలైనప్పుడు తప్ప.

మరుసటి వేసవి సెలవలకి స్వగ్రామం తిరిగివచ్చాడు జగన్నాథరావు. వెనక వరండాలో మూడు నెలల పసివాణ్ణి చూసి ఆశ్చర్యపోయాడు. తల్లి దగ్గరకు వెళ్ళి "అమ్మా ఈ చంటిపిల్లాడు ఎవడే" అని అడిగాడు.

"మన సుబ్బి కొడుకురా!" అంది ఆవిడ.


జీవితంలో మొదటిసారిగా అతనికి తెలిసొచ్చింది. స్త్రీలు ఒక అనుభవానికి ప్రతిఫలంగా పిల్లల్ని కంటారని.

బంగాళాదుంపలు తరుగుతూ తల్లి చెప్పుకుపోతోంది. "పాపం అది అమాయకురాలురా! ఏ వెధవో పుణ్యంకట్టుకుని వాడిదోవన వాడుపోయాడు. ఎవడే అంటే ఇది చెప్పదు, ఇంట్లోంచి తరిమేయమని మీ నాన్న ఒకటేగోల, నేను అడ్డుపడ్డాను. ఈ పండులాంటి వెధవని కంది".

తల్లి ఇంకా చెపుతూనే ఉంది. "ఈ మగవాళ్ళకి దయాదాక్షిణ్యాలు ఉండవని, వాళ్ళది రాతిగుండె అని, కష్టంలో ఉన్న ఆడదానిమీద కనీసం సానుభూతి అయినా చూపించరని ..." జగన్నాథరావుకి ఇంకేమీ వినిపించటంలేదు. అతనికి అర్థమైనదల్లా సుబ్బి తల్లి అయిందని.

ఆ రోజే సాయంకాలం మునిమాపువేళ రత్తమ్మగారు బిందె చంకన పెట్టుకుని వెనక వరండాదాటి దొడ్లో నూతిదగ్గరకు వెడుతోంది. కొంచెం దూరంలో రెండు మూర్తులు కనిపించాయి. వచ్చే ఏడుపును ఆపుకుంటోంది ఒక గొంతు.

"ఏడవకు! ఇదిగో ఈ రూపాయితీసుకుని వాడికి ఏదైనా కొనిపెట్టు. ఎందుకు ఏడుస్తావ్?




వాడు నా బిడ్డేనని నాకు తెలుసు. నేను...”

తన కొడుకు జగన్నాధరావు గొంతును ఇట్టే పోల్చుకుంది. చంకలో బిందె జారి చప్టామీద పడింది. ఆ చప్పుడికి ఇద్దరూ విడిపోయి మాయమయ్యారు.

ఎంతపని జరిగింది? ఇలా అయి ఉండ వచ్చునని తనుఎప్పుడూ ఊహించలేదు. తన కొడుకు... తన ముద్దులకొడుకు ఇలాంటి ఘోర మైనపని ఎల్లాచేయగలడు? ఇదంతా ముండ పని. అమ్మమ్మా! వెఱ్ఱిబాగులదానిలా నటించి, ఎంత మోసం చేసింది? ఈ సుబ్బి ఎంత నంగ నాచి? దీన్ని ఇంట్లోపెట్టుకుని పాముకు పాలు పోసి పెంచినట్టు పెంచింది. తగినశాస్తి చేసిం ది తనకి. ఈ తక్కువ రకం వాళ్ళకి వేరేబుద్ధులు ఎలావస్తాయ్? వీళ్ళకి విశ్వాసం ఎక్కడిది? అభం శుభం తెలియని తన కొడుకుని వల్లో వేసుకుని వాణ్ణి పాడుచేసింది.

పరుగెత్తుకుంటూ వెళ్ళి భర్త గది తలుపులు గబాలున తోసి, లోపలికి పోయి కుప్పకూలి పోయి ఏడుస్తూ “ఇంకేం ఉందండీ అంతా అయిపోయిందండీ! ఈ ముండ మన కొంప ముంచింది” అని ఏడుపు ఆపకుండానే విష యం అంతా చెప్పింది భర్తతో.

వెంకయ్యగారి తల దిమ్మెక్కి పోయింది. కానీ వెంటనే తేరుకుని, కొడుకునీ, సుబ్బినీ పిలిపించారు. ఎంతసేపైనా, ఏమడిగినా వాళ్ళి ద్దరిచేతా ఏమీ చెప్పించలేకపోయారు ఆయన. తర్వాత మెల్లిగా కొడుకుని విడిగా తీసుకువెళ్ళి నీ కొచ్చిన భయమేమీ లేదని బుజ్జగిస్తూ కొంత సేపటికి అసలు సమాచారం రాబట్టారు.

రత్తమ్మగారు తలపట్టుకు కూర్చున్నారు. ఆవిడలోపల అగ్ని జ్వాలలు లేచిపోతున్నాయి. కష్టంలో ఉన్నపుడు ఈ ముండని కడుపులో పెట్టుకుని కాపాడింది. విశ్వాస ఘాతకురాలు తనకొడుకు అమాయకత్వాన్ని ఆసరా తీసుకుని ఇంత నాటకం ఆడింది.

“ఇంట్లోంచి పో! నీముఖం నాకెప్పుడూ చూపించకు” అని అరిచింది.

కానీ వెంకయ్యగారి ధోరణి వేరుగా వుంది ఆయన దృష్టిలో సుబ్బి మోసకత్తెకాదు. అసలైన వెర్రిముండ. తెలివే ఉంటే, కాస్త గడుసుతనమే ఉంటే ఇల్లాంటి ఊబిలో ఇరుక్కుంటుందా?

"ఏదో పిచ్చిముండ. ప్రస్తుతానికి ఇంట్లో ఉండనిద్దాం. మెల్లిగా ఆలోచిద్దాం ఏం చెయ్యాలో!" అన్నారు జంకుతూ వెంకయ్యగారు. తన కొడుకే ఈ పనిచేశాడని తెలిసొచ్చాక, ఆయనకు నైతికంగా ఒక బాధ్యత ఏర్పడినట్టు అనిపించింది. నిస్సహాయంగా, దీనస్థితిలో ఉన్న సుబ్బిని బయటకు పంపించి వేయడం ఆయనకు న్యాయంగా తోచలేదు. తనకొడుకు వయసులో తనుచేసిన ఇల్లాంటి పనులే ఆయనకు జ్ఞాపకం వచ్చాయి ఎటొచ్చీ అదృష్టవశాత్తూ ఇలాంటి ఇబ్బందిలో ఇరుక్కోలేదు. ఉప్పెనలావచ్చి, చుట్టుముట్టేసే గాఢమైన వాంఛలో రెండు యువశరీరాలు చిక్కుకున్నప్పుడు ఆ క్షణంలో ముందు వెనక ఆలోచనలకి చోటెక్కడుంది? తన కొడుకు, సుబ్బి ఇద్దరూ మానవమాత్రులే! ఉడుకురక్తం పిలుపుకి చేతులుచాచే కోర్కెలో ఇద్దరూచిక్కుకున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఎవరినీ తప్పుపట్టడం అవివేకం. ఆయన ఆలోచనల్ని చీల్చుకుంటూ రత్తమ్మగారి కంఠం వినిపించింది.

"వీల్లేదు... ఒక్కక్షణమైనా ఈ యింట్లో అది ఉండడానికి వీల్లేదు... ఇంత జరిగాక"

"కొంచెం ఆలోచించు... అది తెలివితక్కువగానే ప్రవర్తించింది. ఈ రాత్రికి ఉండనిద్దాం. ప్రొద్దుటే లేచి వెళ్లిపోతుంది ఎక్కడికైనా. ఈ అర్ధరాత్రి చీకట్లో, చలిలో ఎక్కడికిపోతుంది"? అన్నారు వెంకయ్యగారు.

రత్తమ్మగారి ఆగ్రహం తారాస్థాయి చేరుకుంది.

"మీకు కావలిస్తే దానికి వేరే మేడ కట్టించి ఇవ్వండి. అది ఒక్కక్షణమైనా ఉండడానికి వీల్లేదు. అదైనా ఉండాలి, నేనైనా ఉండాలి ఈ యింట్లో! అయినా నా మాట ఎవరు విన్నారు గనక ఈ ఇంట్లో? తండ్రీకొడుకులు నాకు వ్యతిరేకం అయితే ఇంతకంటే ఏమి జరుగుతుంది నాకు?" ఆవిడ కంఠం వణికిపోతోంది. మనిషి ఊగిపోతోంది ఆవేశంతో.

వెంకయ్యగారు ఓడిపోయారు. ఈ విషయంగా ఇంట్లో సంక్షోభం బయలుదేరడం ఆయనకు ఇష్టంలేదు. చివరికి అన్నారు ఆయన...

"సుబ్బీ! మీ అమ్మమ్మగారి ఊరువెళ్ళు. ఇదిగో ఇరవై రూపాయలు..."

"ఇంకా డబ్బుకూడానా? ఇంతమటుకు ఖర్చుపెట్టిందిచాలు..." అంటూ ఆ రెండు పది రూపాయలనోట్లూ ఊడలాక్కుంది రత్తమ్మగారు.

ఆ అర్ధరాత్రి చీకట్లో, చలిలో... నాలీచాలని బట్ట బిడ్డకు కప్పి, సుబ్బి ఇంట్లోంచి వెళ్ళిపోయింది.

వెంకయ్యగారికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. నిస్సహాయంగా వెళ్ళిపోయిన సుబ్బిని, ఆ చంటి వెధవనీ గురించి ఆలోచిస్తూంటే రాత్రి గడిచిపోయింది. తెల్లవారగానే లేచి సుబ్బి ఎక్కడికి పోయిందో వాకబు చేసి, పక్క ఊళ్ళో వెదికి పట్టుకుని, దాని చేతుల్లో ఇరవై రూపాయలు కాదు... జేబులో ఉన్నదంతా పెట్టారు. సుబ్బి ఏడుపు మొదలెట్టింది. ఏమీ బాధపడవద్దని, వాళ్ళిద్దరి భవిష్యత్ తాను చూస్తానని, కొంత కాలం అయ్యాక, కాస్త అమ్మగారి కోపంతగ్గాక, తిరిగి ఇంటికి వచ్చే ఏర్పాటు చేస్తానని ఓదార్చి, సుబ్బికి కాస్త మనస్థిమితం కలగజేసి తిరిగి వచ్చారు. ●